ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..



ధ్వంసమైన రోడ్డు



రోడ్డుకు ఏర్పడిన బుంగపై కర్రకు కవరు కట్టి పాతిన స్థానికులు

- మైలారం– జోగంపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామం నుంచి జోగంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు సమీపంలో నీటి పైపుల లీకేజీతో బీటీ రోడ్డు ధ్వంసమై పూర్తిగా ప్రమాదకరంగా మారింది. రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మైలారం నుంచి జోగంపల్లి వెళ్లే రోడ్డు మలుపులతో ప్రమాదకరంగా ఉన్నా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇంతేకాకుండా జోగంపల్లి గ్రామ శివారులోని పంపుహౌజ్ సమీపంలో రోడ్డుకు కుడివైపు బుంగ పడగా స్థానికులు కర్ర పాతి ప్రమాద సూచికంగా కవర్ కట్టారు. రోడ్డుకు ఎడమ వైపున పెద్ద గుంత ఏర్పడడంతో దానికి సూచికగా ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చే వాహనదారులు గమనించకపోతే ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి మైలారం గ్రామ శివారులో ధ్వంసమైన రోడ్డును, జోగంపల్లి శివారులో ఏర్పాడిన గుంతలకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.



లీకేజీతో బురదమయమైన రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన బుంగ

ఇబ్బంది పడుతున్నాం



మైలారం నుంచి పరకాలకు వెళ్లాలంటే రోడుకు ఏర్పాడిన గుంతలతో భయాందోళన తప్పడం లేదు. ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే ఇబ్బంది కరంగా ఉంది. భారీ గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికై నా అధికారులు చొరవ చూపి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

- దూదిపాల కొమురారెడ్డి, మైలారం

సీతారాముల కల్యాణానికి తరలిరావాలి



వేలేరు : మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు



శాయంపేట : కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్

వేలేరు : మల్లికుదుర్ల గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ గౌరవ అధ్యక్షుడు పల్లా రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు మహేందర్ బుధవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వామి వారి కల్యాణానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే భక్తులు కానుకల ద్వారా అందించిన 23 గ్రాముల బంగారాన్ని స్వామివారికి, అమ్మవారికి నగలు, ఆభరణాలు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రామస్వామి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలో ఈనెల 6న నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, అడ్వొకేట్ లెక్కల జలెందర్‌రెడ్డి బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. ఈనెల 6న నిర్వహించే సీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవానికి ఉదయం 10.30 గంటలకు తలంబ్రాలు తీసుకుని రావడం, 11గంటలకు కంది శ్రీనివాస్‌రెడ్డి ధార్మిక ఉపన్యాసం, మధ్యాహ్నం 12.05గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం వైభంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం లెక్కల లక్ష్మీజలెందర్ రెడ్డి దంపతులు అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నీల సమ్మిరెడ్డి, గిద్దమారి సురేశ్, కోమటి గణేశ్, గొట్టిముక్కుల సుమన్, బత్తుల రాజేశ్, నీల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు హాజరు కావాలి

- సీఐ రంజిత్‌రావు

శాయంపేట : పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో రేపు నిర్వహించే జాబ్ మేళాకు శాయంపేట మండలం నుంచి యువతి, యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి వినియోగించుకోవాలని శాయంపేట సీఐ రంజిత్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం యువకులకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని నిరుద్యోగ యువత విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరై స్కిల్స్ (టెక్నికల్ లేదా నాన్ టెక్నికల్) ద్వారా ఉద్యోగాలు పొందాలని సూచించారు. జాబ్ మేళా ఒక్కరోజు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జక్కుల పరమేశ్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు సాదు నాగరాజు, యువకులు పాల్గొన్నారు.



యువకులతో మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

సభ్యత్వంతోనే ఐకమత్యం



పద్మశాలి సంఘ సభ్యత్వం నమోదును ప్రారంభిస్తున్న ప్రకాశ్

శాయంపేట : సంఘంలో సభ్యత్వం కలిగి ఉంటే అందరూ ఐకమత్యంగా ఉంటారని పద్మశాలి సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కందగట్ల ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలోని పత్తిపాకలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ప్రతీ ఒక్క పద్మశాలి బిడ్డ విధిగా సంఘ సభ్యత్వం పొంది ఉండాలన్నారు. పద్మశాలీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి కందగట్ల ప్రవీణ్, మండల కమిటీ సభ్యుడు కుసుమ రమేశ్, సభ్యులు గుర్రం రమేశ్, బంగ జోగయ్య, కందగట్ల రాజేశ్, కొండబత్తుల సాంబయ్య, శంకరయ్య, నవీన్, చంద్రప్రకాశ్, బూర జనార్దన్, బంక ప్రసాద్, శ్రీధర్, సాంబయ్య, రామలింగం, వెంకటయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి



ఎల్కతుర్తి : పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంఘం నాయకులు



కమలాపూర్‌లో..

కమలాపూర్ : శనిగరంలో రేణుక ఎల్లమ్మతల్లి గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు సదానందం, యూత్ అధ్యక్షుడు అరవింద్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి రమేశ్, గౌరవ అధ్యక్షులు శ్రీకాంత్, రాజు, కోటిగౌడ్, డైరెక్టర్లు శ్రీధర్, యాలాలు, కృష్ణకాంత్, క్రాంతి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బుధవారం ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూ. 2,04,300 పలికిన తైబజార్ వేలం

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, వారాంతపు సంత (తైబజార్) వేలం రూ.2,04,300 పలికింది. మండల పంచాయతీ అధికారి బూర రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ కల్వల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం వేలం నిర్వహించగా తైబజార్‌ను రూ. 2,04,300లకు మండల కేంద్రానికి చెందిన కోడెపాక స్వరూప దక్కించుకున్నారు. గ్రామపంచాయతీ కాంప్లెక్స్‌లో 7రూంలకు గాను 5రూంలను వ్యాపారస్తులు టెండర్ దక్కించుకోగా, ఇంకా 2రూంలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన వారు డిపాజిట్ కట్టి తీసుకోవాలని తెలిపారు. కార్యదర్శి మడికొండ రత్నాకర్, కారోబార్ మోహన్, రమేశ్ పాల్గొన్నారు.

‘దొంతి’కి మంత్రి పదవి ఇవ్వాలి

ధర్మసాగర్ : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పని సంపత్ కోరారు. మండలంలోని నారాయణగిరిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మాధవరెడ్డి 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం పనిచేస్తూ కార్యకర్తల వెన్నంటి ఉన్నారని గుర్తుచేశారు. పార్టీ నాయకులు తూటి నర్సింహారెడ్డి, రంజిత్, రాజ్‌కుమార్, రాజయ్య, ఎల్లగౌడ్, రంజిత్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

వేలేరు : మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21వ తేదీన మొదలైన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 282 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు మండల విద్యాశాఖ అధికారి చంద్రమౌళి తెలిపారు.

ఎంపీడీఓగా రఘుపతిరెడ్డి

ఐనవోలు : ఐనవోలు మండల ఎంపీడీఓగా గోపు రఘుపతిరెడ్డి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన పులి వెంకటేశ్వర్లు మార్చి 31న ఉద్యోగ విరమణ పొందడంతో మండలంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న గోపు తిరుపతిరెడ్డి జెడ్పీ సీఈఓ ఉత్తర్వుల మేరకు బుధవారం ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించారు.

గ్రూప్ -1 విజేతకు సన్మానం

రామన్నపేట: నగరంలోని వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో 2015 – 2018 బ్యాచ్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన పూర్వ విద్యార్థి మహ్మద్ విలాయత్ అలీ ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్ -1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 86వ ర్యాంక్, బీసీ –ఈ కేటగిరిలో రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్, జోన్ స్థాయిలో 1వ ర్యాంక్ సాధించారు. ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎం.వెంకన్న సన్మానించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వేలేరు : సైబర్ నేరాలపై అప్రపత్తంగా ఉండాలని ఎస్సై అజ్మీర సురేశ్ అన్నారు. సైబర్ జాగృత దివాస్ సందర్భంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీ వివరాలను ఎవరికి చెప్పొద్దని అన్నారు. అలాగే ఎవరైన సైబర్ మోసాలకు పాల్పడితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ షాపుల్లో ప్రధాని ఫొటో పెట్టాలి

కమలాపూర్ : సన్నబియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ షాపుల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నిరుపేదలకు ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో బియ్యం మాత్రమే ఇస్తుందన్నారు. ప్రోటోకాల్ లేని వ్యక్తులతో అధికారిక కార్యక్రమాన్ని ఎలా ప్రారంభిస్తారని, కమలాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రణవ్ ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు సురేశ్, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, శోభన్, ప్రవీణ్, కోటేశ్వర్, అద్భుతరావు, రత్నాకర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగని మట్టి తవ్వకాలు

దామెర : మండల కేంద్రంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం రాత్రి దామెర గుట్టల్లో అనుమతులు లేకుండా జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టి, మొరం తవ్వకాలు చేస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

‘భగీరథ’ లీకేజీకి మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రం నుంచి కొత్తగట్టు సింగారానికి వెళ్లే బైపాస్ రోడ్డు మలుపు వద్ద మురికి కాల్వలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యి కలుషిత నీరు సరఫరా అయ్యే విషయం తెలిసిందే. కాగా మార్చి 30న సాక్షి దినపత్రిలో ‘మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ’ కథనం ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్ బుధవారం సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. వెంటనే లీకేజీ అవుతున్న పైపులైన్‌కు మరమ్మతు చేయించారు.

కారు, బైక్ ఢీ

ముగ్గురికి గాయాలు

వేలేరు : ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మల్లికుదుర్ల శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన పిట్టల రిషికుమార్, మోడెం శివ, పోలు శేఖర్ బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో జానకిపురం నుంచి మల్లికుదుర్ల గ్రామానికి పానీపూరి తినేందుకు వచ్చి తిరిగి జానకిపురం గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి మల్లికుదుర్ల వైపు వస్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

వివాహిత అదృశ్యం



ఐనవోలు : వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలోని పున్నేలు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం రేబెల్లి అనిత బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బీరువాలో ఉన్న 4 తులాల బంగారం, 20 తులాల వెండి తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆమె ఆచూకీ కోసం భర్త సుమన్ ప్రయత్నించగా లభించలేదు. కాగా సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల కిరాణంపై దాడులు చేయగా 10లీటర్ల గుడుంబా లభించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి సరోజనకు చెందిన కిరాణంలో గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం వచ్చిందన్నారు. దీంతో తనిఖీ చేయగా 10లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకొని సరోజనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలపిల్లలు మృతి

దామెర : పిచ్చి కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతిచెందిన సంఘటన దామెర మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగ ఐక్కయ్యకు చెందిన మందలో కుక్కలు చొరబడి 12 గొర్రెపిల్లలపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో మృతిచెందిన గొర్రెల విలువ సుమారు 50 వేలు ఉంటుందని వెల్లడించారు.

అర్హులందరికీ సన్నబియ్యం పంపిణీ

- ఆర్డీఓ రమేశ్ రాథోడ్

ఎల్కతుర్తి : తెల్లరేషన్‌కార్డు కలిగి ఉన్న అర్హులందరికీ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని ఆర్డీఓ రామేశ్ రాథోడ్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తి మండలం పెంచికలపేట రేషన్ షాపులో లబ్ధిదారులకు సన్నంబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. సన్నబియ్యాన్ని లబ్ధిదారులు కుటుంబ సమేతంగా వంట చేసుకుని భుజించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, ఆర్ఐ సదానందం, పంచాయతీ కార్యదర్శి, రేషన్ డీలర్ తదితరులు పాల్గొన్నారు.



పెంచికలపేటలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్

రజతోత్సవ సభకు కదిలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఆయన నివాసగృహంలో బుధవారం జరిగిన నియోజకవర్గంలోని పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం, మండలాలతో పాటు జీడబ్ల్యూఎంసీ 15,16,17 డివిజన్ల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలను మరిచి ప్రజలను మోసం చేస్తోందని, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, అందుచేతనే స్థానిక ఎన్నికలను నిర్వహించడం లేదని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమన్వయ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, కుమారస్వామి, రాము, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ఆర్భాటం హాస్యాస్పదం

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

ఆత్మకూరు : పేదలకు సన్నబియ్యం ఇచ్చేది కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమైతే ఆర్భాటం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని రేషన్‌షాపుల వద్ద బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో మోదీ ఫొటోలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పథకంలో భాగంగా రేషన్‌కార్డులో ఉన్న ప్రతి సభ్యుడికి 5కిలోల బియ్యం ఉచితంగా ఇస్తుండగా రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కిలో బియ్యం ఇస్తుందని, ఆ కిలో బియ్యానికే ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్‌మోర్చా నియోజకవర్గ కోకన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బయ్య పైడి, నాయకులు సునీల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



రేషన్‌షాపులో మోదీ ఫొటో ఏర్పాటు చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రజా ఉద్యమాలపై అణచివేత ఆపాలి



ఐనవోలు : సీపీఎం నాయకులను అరెస్టు చేసిన ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు : ప్రజా ఉద్యమాలపై పోలీసుల నిర్బంధాన్ని, అణచివేతను ఆపాలని, లేని పక్షంలో ప్రభుత్వ పతనం తప్పదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాడబోయిన లింగయ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కాగా పోలీసులు జిల్లా కమిటీ సభ్యుడు లింగయ్యతో పాటు నారాయణరెడ్డి, మడిగె నాగరాజు, ఉప్పలయ్య, చిన్న మహేందర్, రాంకుమార్, యాకయ్య, నర్సయ్య, వనమ్మ, పోచమ్మ, ప్రమీల, సరోజన, పుష్ప తదితరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం లింగయ్య మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న యూనివర్సిటీ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్ చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. అనాలోచిత నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూనివర్సిటీ భూముల జోలికి వెళ్లొద్దు

శాయంపేట : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సెంటర్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించేందుకు సిద్ధపడడం అన్యాయమని అన్నారు. యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాలం ఆడుతున్నారని, వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం చేతగాక యూనివర్సిటీ భూములపై కన్నేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, కృష్ణారెడ్డి, రమేశ్, వెంకట్, సాయి, రాజేశ్, శశి, నితిన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

ఆత్మకూరు : కేంద్రంలోని బీజేపీ సర్కార్ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతుందని జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కోఆర్డినేటర్ కూచన రవళిరెడ్డి ఆరోపించారు. మండలంలోని కటాక్షపూర్, హౌజుబుజుర్గు గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవళిరెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు క్షమించరానివని మండిపడ్డారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదంతో రాష్ట్రంలో సామాజిక విప్లవం వచ్చిందన్నారు. కేంద్రం పన్నుతున్న కుట్రను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలకు కళ్లు మండుతున్నాయని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ కాంగ్రెస్ వెంటే ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, ఆత్మకూరు ఏఎంసీ చైర్‌పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, గఫూర్, మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, యూత్ నాయకులు మాదాసి శ్రీధర్, సందీప్, సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ముద్దం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూచన రవళిరెడ్డి